



గోపాల్ చెరువు శిఖంలో సమ్మక్క సారలమ్మ జాతర గద్దెల వద్ద ఆనాథ ఆశ్రమ భవన నిర్మాణ పనులు



జక్కని చెరువు సమీపంలో ప్రభుత్వ భూమి అని బోర్డు పాతిన రెవెన్యూ అధికారులు.. పక్కనే నిర్మించిన భవనాలు

కరీంనగర్ మండలంలో 17 గ్రామాల్లో 68 పెద్ద చెరువులు, ఐదు పెద్ద చెరువులు మొత్తం 73 ఉండేవి. బొమ్మకల్ గ్రామ పరిధిలోని జక్కప్ప చెరువు 46.21 ఎకరాలు ఉండగా 20 ఎకరాలు కబ్జాకు గురైంది. రాయికుంట 9.08 గుంటల భూమి ఉండగా ఇప్పుడు ఇక్కడ ఇంచు భూమి కూడా లేదు. మల్లె చెరువుకు సంబంధించిన 14.10 ఎకరాల భూమిలో ఇందిరమ్మ ఇళ్లు, భూమి లేని నిరుపేదలకు ప్రభుత్వం పట్టాలుగా పంపిణీ చేసింది. 16.10 ఎకరాల నల్ల చెరువు అందులో 7 ఎకరాలు కబ్జాకు గురికాగా మిగిలిన భూమిలో చెరువు ఉంది. గోధుమకుంటకు 23.02 ఎకరాల భూమి ఉండగా దాదాపు 10 ఎకరాలకుపైగానే భూఆక్రమణ అయినట్లు స్థానికులు చెబుతున్నారు.

కరీంనగర్ కార్పొరేషన్‌కు ఆనుకొని ఉన్న అత్యంత విలువైన గోపాల్‌చెరువు సర్వేనెంబర్ 728లో 28.10 ఎకరాల భూమి ఉండేది. ఇందులో రెండు ఎకరాలు పదేళ్ల క్రితం సమ్మక్క జాతరకు, రెండు ఎకరాలు మున్సిపల్ మురికినీరు శుద్ధి కేంద్రానికి కేటాయించారు. మిగిలిన 24 ఎకరాల భూమిలో ఎలాంటి అనుమతులు లేకుండా కొందరు కుల సంఘభవనాలు, దేవాలయాలు నిర్మాణం కోసం ఆక్రమించుకోగా, కొంత భూమిని ఐఎంఎ ఆధ్వర్యంలో చెట్ల పెంపకం కోసం కేటాయించారు. అనాధవృద్ధాశ్రమానికి, ఎకరం భూమి వైశ్య కర్మకాండ నిలయానికి కేటాయించగా, కొన్ని ఎకరాల భూమిని లారీ ట్రాన్స్‌పోర్టు అసోసియేషన్ పార్కింగ్ స్థలంగా వినియోగిస్తుండగా, నగరానికి ఆనుకొని ఉన్న విలువైన భూములు రాజకీయ నాయకుల అండదండలతో ఆక్రమణలకు గురయ్యాయి.



గోపాల్ చెరువు సమీపంలో నిర్మాణాలు



నగరంలో హైడ్రా ప్రకంపనలు

కబ్జాల నగర్‌కు కాడ్రా కావాలి

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

హైడ్రా ప్రకంపనలు కరీంనగర్‌కు వ్యాపించాయి. హైడ్రా మాదిరిగానే కరీంనగర్ జిల్లాలో కూడా కాడ్రాను ఏర్పాటు చేసి చెరువులు, కుంటల ఆక్రమణలను తొలగించాలని, ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేయాలనే డిమాండ్ వస్తున్నది. జిల్లాలో భూముల ధరలు పెరగడం, గజం వేయి రెండు వేలు పలికిన చోట 50, 60 వేలకు ఎగబాకడంతో అక్రమార్కుల దృష్టి ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలపైన పడింది. ఖాళీ జాగా కనిపిస్తే చాలు రాత్రికి రాత్రి కాంపౌండ్ వాల్స్, బేస్‌మెంట్‌లు, నిర్మించి పాగా వేస్తున్నారు. రియల్ మాఫియా పెట్రేగి ఒక్కో స్థలాన్నే నాలుగేసి సార్లు వేర్వేరు వ్యక్తులకు, వేర్వేరు ప్లాన్లతో రిజిస్టరు చేయించి కోట్ల రూపాయలు దండుకున్నారు. స్థలాలు కొన్న వ్యక్తులు కోర్టుల చుట్టూ, పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిరుగుతూ లబోదిబో మంటుంటే పట్టించుకునే వారే లేకుండా పోయారు. రాజకీయ, పోలీసు, రెవెన్యూ అధికారుల తోడ్పాటుతో రియల్ మాఫియా ఆడింది ఆటగా.. పాడింది పాటగా సాగి కరీంనగర్ జిల్లా కేంద్రం కబ్జాల కేంద్రంగా మారింది.

జిల్లాకు వచ్చిన పోలీస్ కమిషనర్ అభిషేక్ మోహంతి ఎకనామిక్ అఫెన్స్ వింగ్ (ఈవోడబ్ల్యూ) ఏర్పాటు చేసి భూకబ్జాలు, చీటింగ్ రిజిస్ట్రేషన్లు, భూదందాలో మోసాల ఫిర్యాదులను స్వీకరించడంతో ఇప్పటికే 2500లకు పైగా దరఖాస్తులు వచ్చాయి. వాటిలో క్షుణ్ణంగా పరిశీలించిన దరఖాస్తుల్లో అక్రమాలు జరిగినట్లు ఆధారాలు లభ్యమైన కేసుల్లో 80 మందిని అరెస్టు చేసి కోర్టుకు పంపించారు. వీరిలో రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపారులు, రియల్ మాఫియా సభ్యులు ఉండడం గమనార్హం. దీనికితోడుగా కాడ్రా కూడా ఏర్పాటు చేస్తే కబ్జాల బాగోతం బట్టబయలు అవుతుందని బాధితులకు న్యాయం జరగడంతోపాటు ప్రభుత్వ స్థలాలు రక్షించే అవకాశం లభిస్తుందనే అభిప్రాయం బలంగా వ్యక్తమవుతున్నది. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ జిల్లాల్లో కూడా హైడ్రా వంటివి ఏర్పాటు చేసి ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామని ప్రకటించారు. ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మన్‌కుమార్ కూడా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కూడా కాడ్రా వంటివి ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

తీగలగుట్టపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 215 ఊరకుంట శిఖం భూమి 8.02 ఎకరాలుండగా పక్కనఉన్న 214 సర్వేనెంబర్ చూపిస్తూ ఈ శిఖం భూమిలో దాదాపు రెండు, మూడు ఎకరాల భూమిని దొంగపట్టాలు సృష్టించి అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆరెపల్లిలోని మాలకుంట, ఉడతకుంట, అవుసుల కుంటలు సగానికిపైగా ఆక్రమణలకు గురయ్యాయి.

కొత్తపల్లి మండలం 8 గ్రామపంచాయతీలతో పాటు కొత్తపల్లి మున్సిపాలిటీ, నగరపాలక సంస్థలో విలీనమైన రేకుర్తి, సీతారాంపూర్ గ్రామాల్లో చెరువులు పూర్తిగా కనిపించకుండా ఆక్రమణలకు గురయ్యాయి. సీతారాంపూర్‌లోని సర్వేనెంబర్ 71లో మెల్లకుంట 13.28 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా ఇప్పుడు అక్కడ అసలు కుంట కనిపించే పరిస్థితి లేదు. రేకుర్తి చెరువును ఆనుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టారు. కొత్తపల్లి పట్టణంలో ఉన్న పెద్దచెరువుకు ఆనుకొని రహదారి వరకు అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా చేపట్టారు.



రేకుర్తి చెరువు పక్కనే వేసిన షెడ్డు

● కబ్జా కోరల్లో చెరువులు..కుంటలు

జిల్లాలోని పలు చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయి. అధికారయంత్రాంగం యావత్తు కొలువై ఉండే జిల్లా కేంద్రంలోనే కబ్జాల పర్వం ఎలాంటి ఆటంకాలు లేకుండా సజావుగా సాగిపోయి కబ్జాకోరులు కోట్లు దండుకున్నారు. కబ్జాకోరుల్లో రాజకీయనాయకులు, రియల్ వ్యాపారులు, డబ్బున్న బడాబాబులు ఉండడంతో అధికారయంత్రాంగం కూడా చూసీ చూడనట్లు ఉందని అవసరమైన చోట అండదండలందించి కబ్జాలు జరిగేందుకు తోడ్పడిందనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. పోలీసు కమిషనర్‌కు వస్తున్న ఫిర్యాదుల్లో రాజకీయ నాయకులు, అధికారుల ప్రమేయం ఉన్నట్లు పేర్కొంటుండడమే ఇందుకు తార్కాణంగా చెప్పవచ్చు.

● జిల్లా కేంద్రంలోని సప్తగిరికాలనీలో సర్వేనెంబర్ 1026లోని 11.15 ఎకరాల విస్తీర్ణంలో ఉండే ఆవాజ్‌కుంట కొంత మేరకు కబ్జాకు గురైంది. ఆవాజ్‌కుంట చుట్టూ ఉన్న స్థానికులు రెండు నుంచి మూడు ఎకరాల వరకు స్థలాన్ని ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. కుంటకు సంబంధించిన ఇదే సర్వేనెంబర్‌లో సప్తగిరికాలనీ హైస్కూల్ నుంచి కస్తూర్బా స్కూల్, విద్యుత్ సబ్‌స్టేషన్, పలు దేవాలయాలకు, మున్సిపల్ వెహికిల్ షెడ్‌కు, కుల సంఘాలకు కేటాయించారు. ఇదే సర్వేనెంబర్‌లో పోలీసు కిష్టయ్యకు కూడా రెండు గుంటల స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుతం ఆవాజ్‌కుంట ఆనవాళ్లే లేకుండా పోయాయి. రెండు గుంటల స్థలాన్ని స్థానిక కార్పొరేటర్ ఆక్రమించినట్లు సమాచారం.

● జిల్లా కేంద్రంలోనూ చెరువులు మాయం

● ఆక్రమణలను తొలగించాలని ప్రజల డిమాండ్

● పూర్వపు రాంనగర్ గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీహరినగర్, పీటీసీ ఏరియా మొత్తాన్ని తుమ్మెర కుంట, చాకలికుంట ప్రాంతం భూములు. ఇప్పటికి భారీ వర్షం కురిస్తే పీటీసీ పక్కన కుంట అలుగు పారుతుంది. శ్రీహరినగర్ మొత్తం నీటిమయం అవుతుంది. ఇందులో కొంత భూమిని పోలీస్ ట్రైనింగ్ సెంటర్ (పిటిసి), మంచినీటి రిజర్వాయర్‌కు కేటాయించగా మిగిలిన కుంట భూమి ఇప్పుడు పట్టాభూములుగా మారాయి. ప్రస్తుతం ఈ ప్రాంతంలో సెంటు భూమి కూడా లేదు.

● హుజూరాబాద్ పట్టణంలోని గంగోని కుంటను కొంత మంది అక్రమార్కులు ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టారు. అలాగే సర్వేనెంబర్ 2477లో గంగోనికుంట 12.16 గుంటల భూమి ఉండగా నాలుగు ఎకరాలు కబ్జాకు గురైనట్లు స్థానికులు చెబుతున్నారు. ఇంకా చెరువులో మట్టి పోసి ఆక్రమణ చేస్తూనే ఉన్నారు.

● గన్నేరువరం మండలంలోని గుండ్లపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 295లో 11.01 ఎకరాల విస్తీర్ణంలోని దేవుని చెరువుశిఖం భూమిలో 20 గుంటల భూమిని కరీంనగర్ డెయిరీ సంస్థ ఆక్రమించుకొని పాలకేంద్రాన్ని నిర్వహిస్తోంది. దీనిపై సీపీఐ నాయకులు ఆందోళను చేసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదు.

● ఇల్లందకుంట మండలంలోని బూజునూర్ గ్రామంలోని చింతల చెరువులో 20 ఎకరాల భూమి కబ్జా చేసినట్లు గ్రామస్థులు చెబుతున్నారు.



సీతారాంపూర్ మెల్లకుంట వద్ద నిర్మాణాలు

కమాన్‌పూర్ గ్రామ చెరువు కరీంనగర్-సిరిసిల్ల రహదారిని ఆనుకొని ఉండడంతో ఆ భూమికి విలువ పెరుగడంతో ఆక్రమించుకొని ఇళ్లను నిర్మించుకున్నారు. రాజకీయనాయకుల జోక్యంతో చెరువు భూమి ఆక్రమణలకు గురైనట్లు చెబుతున్నారు. ఇదే గ్రామంలోని తూముకుంట 120 సర్వేనెంబర్‌లో 4 ఎకరాల భూమి కబ్జాకు గురైంది.

● బాహంపేటలోని 60 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బావు చెరువు, ముత్యాలకుంటలో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. తూముకుంట, ఒజ్జాలమ్మకుంట భూములు కూడా కబ్జాకు గురయ్యాయి.

● చింతకుంటలోని చెరువు ఎల్‌ఎండిలో మునిగింది. చెరువుశిఖంలోని 141, 142 సర్వేనెంబర్‌లో ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్, రాజీవ్‌గృహకల్ప, బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం, అంబేద్కర్ భవన్, వ్యవసాయ క్షేత్రంకు కేటాయించగా పలు సంఘ భవనాలు నిర్మించుకోగా, కొందరు విలువైన భూములను పక్క సర్వేనెంబర్‌తో ఆక్రమించుకున్నారు. దీనితో ఇప్పుడు అక్కడ శిఖం భూమి లేకుండా పోయింది.



జక్కని చెరువు ప్రాంతంలో నిర్మించిన ప్రహరి



కమాన్‌పూర్ ప్రధాన రహదారి పక్కనే ఉన్న చెరువు శిఖంలో నిర్మిస్తున్న కట్టడాలు

సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

● కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

సుభాష్‌నగర్, ఆగస్టు 28: సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేస్తూ, రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ సమగ్రశిక్ష ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బెజ్జంకి అంజనేయులు, దుర్గం శ్రీనివాస్ కోరారు. బుధవారం జేఏసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది సెప్టెంబరు 13న చేపట్టిన సమగ్ర శిక్ష ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని హనుమకొండలో సందర్శించి సంఘీబావం తెలిపారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. తాము అధికారంలోకి వస్తే సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చారన్నారు. విద్యాశాఖలో భాగమైన సమగ్రశిక్షలో రాష్ట్ర వ్యాప్తంగా 19,652 మంది కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నారని తెలిపారు. 2006 నుంచి వివిధ హోదాల్లో కాంట్రాక్టు పద్ధతిపై పనిచేస్తున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ చైర్‌పర్సన్‌గా రోస్టర్ మెరిట్ రోల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ, ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశారని తెలిపారు. గత 18 సంవత్సరాలుగా కాంట్రాక్టు పద్ధతిపై అంకితబావంతో సేవలందిస్తున్నా ప్రభుత్వాలు తమను పట్టించుకోలేదని వాపోయారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని, మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన 180రోజుల ప్రసూతి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నేడు తెలుగు భాషా దినోత్సవం



కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 28: దేశ భాష లందు తెలుగు లెస్స అని శ్రీకృష్ణదేవరాయలు అన్నారు.ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్ అని విదేశీ యులు తెలుగును ప్రశంసించారు. పలువురు పరదేశీయులు మన భాషను అభిమానించారు. తెలుగు భాషలో వ్యవహారిక వాదానికి నాంది పలికిన భాషావేత్త గిడుగు రామమూర్తి పంతులు జయంతి ఆగస్టు 29ని తెలుగు భాషా దినోత్సవంగా జరుపుకుంటారు.

గిడుగు రామమూర్తి వ్యవహారిక భాషా ఉద్యమాన్ని నడిపారు. తెలుగు-సవర, ఇంగ్లీష్-సవర నిఘంటు వులు, గద్య చింతామణి, వ్యాసావళి, నిజ సాంప్రదాయం వంటి గ్రంధాల రచనతో పాటు తొలి వ్యవహారిక భాషా పత్రిక తెలుగు పత్రికను స్థాపించారు. సభలు నిర్వహించారు. సాహితీ వేత్తలతో కలిసి వర్తమాన ఆంధ్ర భాషా ప్రవర్తక సమాజాన్ని ప్రారంభించారు.

● తెలుగుకు పట్టం కట్టాలి..

సిపి బ్రౌన్, థామస్ మన్రో, కాలిన్, మెకంజీ వంటి పలువురు విదేశీయులు తెలుగు భాషకు సేవ చేశారు. మన భాషకు పట్టం కట్టాలంటే భాషపై ఆసక్తి పెంచుకొని తెలుగులోని తీపిని, సోయగాన్ని గ్రహించాలి. ప్రభుత్వం, పాలకులు, ప్రజల్లో భాషాభిమానం పెరగాలి. ప్రణాళికలు, ప్రభుత్వ ఉత్తర్వులు, ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో కొనసాగితే తెలుగు మరింత ఖ్యాతినార్జిస్తుంది. అధికార భాషా సంఘం, తెలుగు అకాడమి, సాహిత్య అకాడమి, భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు విశ్వవిద్యాలయం వంటి సంస్థలు కార్యాచరణ ప్రణాళికతో ప్రాథమిక స్థాయి నుంచే తెలుగు మాధ్యమంగా అమలయ్యేలా చూడాలి.

అధికారికంగా తెలుగును అమలు చేయాలి

- డాక్టర్ గంభ్ర లక్ష్మణరావు, సాహితీవేత్త



మన భావాల్ని హాయిగా, ఆనందంగా పంచుకోవడానికి మాతృభాష ఓ మంచి సాధనం. తల్లి చేతి గోరుముద్దలు, జోల పాట వంటిది మాతృభాష. ప్రభుత్వం తెలుగు భాషను అధికార భాషగా నిర్బంధంగా అమలు చేయాలి.

తెలుగులోనే మాట్లాడాలి.. రాయాలి


- డాక్టర్ నలిమెల భాస్కర్, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత



జీవిత కాలం ప్రేరణగా నిలిచేది తెలుగు భాష. ఆలోచన్ని సహజ పద్ధతిలో సులభ రీతిలో శాస్త్రీయంగా చెబుతుంది. తెలుగు భాష ప్రపంచ భాషల్లో దేనికీ తీసిపోని భాష. తెలుగులో మాట్లాడాలి. రాయాలి.

తెలుగు వెలుగుల కోసం కృషి చేయాలి

- అన్నవరం దేవేందర్, కవి



తెలుగు వెలుగుల కోసం సభలు, సమావేశాలు, అవధానాలు, గ్రంధావిష్కరణల ద్వారా మాధుర్యాన్ని నేటి తరానికి చవి చూపించాలి. మాండలిక, ప్రాంతీయ భాషలను బతికించుకోవాలి. సాహితీవేత్తలు, పరిశోధకులతో ఉపన్యాసాలు ఇప్పించాలి.

భాషా వికాసానికి పునరంకితం...

- కాండూరి వేంకటేశ్వర్లు, కవి



ప్రాథమిక స్థాయి నుంచే తెలుగును నేర్పించాలి. ప్రజల వ్యవహారానికి భాష దూరం కాకుండా తెలుగు భాషా వికాసం కోసం పునరంకితం కావాలి. తల్లి లాంటి మాతృభాషకు దూరం కావద్దు.

కేశవపట్నం బస్టాండ్‌లో
ప్రయాణికురాలి పర్స్ చోరీ
దొంగకు దేహశుద్ధి చేసిన స్థానికులు

శంకరపట్నం, ఆగస్టు 28 : మండల కేంద్రంలోని బస్టాండ్‌లో బుధవారం ఓ మహిళ పర్సు దొంగలించిన వ్యక్తిని వెంటాడి పట్టుకొని బాధిత మహిళ, స్థానికులు దేహశుద్ధి చేశారు. వీణవంక మండలం ఘన్ముక్కుల గ్రామానికి చెందిన ఓ ప్రయాణికురాలు బస్ కొరకు బస్టాండ్‌లో వేచిచూస్తున్న సమయంలో ఓ వ్యక్తి పర్సు, ఫోన్‌ను దొంగలించాడు. అప్రమత్తమైన మహిళ దొంగను పట్టుకొని దేహశుద్ధి చేయగా గమనించిన స్థానికులు చోరీ చేసిన వ్యక్తిని పోలీసులకు అప్పగించే ప్రయత్నం చేయగా అక్కడి నుంచి పారిపోయినట్లు తెలిపారు.

సినిమా వార్తల కోసం
www.andhrajyothy.comను క్లిక్ చేయండి

సెప్టెంబరు 1న ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్
ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్ , ఆగస్టు 28: కరీంనగర్ జిల్లా కోకో అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబరు 1వ తేదీన కరీంనగర్ ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. మానకొండూరు మండలం దేవంపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బాల బాలికల విభాగాలలో ఉదయం 9 గంటల నుంచి ఈ ఎంపిక పోటీలను నిర్వహించనున్నామని జిల్లా కోకో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వై మహేందర్‌రావు తెలిపారు.

పోటీలలో పాల్గొనుటకు ఆసక్తి గల క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్‌తో పాటు జిరాక్స్ పుట్టినతేదీ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. క్రీడాకారుల ఇండెక్స్ బాల బాలికలకు ఎత్తు సెంటీమీటర్లలో, బరువు కిలోల్లో, వయస్సు సంవత్సరాలలో మొత్తం 215 పాయింట్లు దాటకుండా ఉండాలి. వయస్సు 3-10-2010 తేదీ తర్వాత జన్మించిన వారు. 14 వత్సరాలలోపు ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. ఈ పోటీలలో ప్రతిభ చాటే క్రీడాకారులను సెప్టెంబర్ 13,14,15 తేదీలలో ఖమ్మంలో జరగనున్న 34వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపిక చేయనున్నామని ఆయన తెలిపారు.

గడ్డి మందు కొట్టిన మేత తిని మేకలు మృతి

వేములవాడ రూరల్, అగస్టు 28: మండలంలోని బాలరాజుపల్లిలో గడ్డి మందు కొట్టిన మేత తిని మేకలు బుధవారం మృతి చెందాయి. స్థానికుల కథనం ప్రకారం బాలరాజుపల్లి గ్రామానికి చెందిన పోచనేని ప్రమీల, సత్తయ్య రోజూ మాదిరిగానే బుధవారం ఉదయం తమ మేకలను మేతకు తీసుకెళ్లారు. మధ్యాహ్నం సమయంలో ఓ రైతు పొలం వద్దకు చేరుకున్న మేకలు గడ్డి మందు కొట్టిన మేతను తినడంతో ఎనిమిది మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. మేకలు మృతి చెందడంతో యజమానులు బోరున విలపించారు. తమకు 1,50,000 రూపాయల నష్టం జరిగిందని ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి చేసారు.

నకిలీ అల్లోపతి వైద్యశాలల్లో
అధికారుల తనిఖీలు


పెద్దపల్లిలో తనిఖీలు చేస్తున్న అధికారులు

పెద్దపల్లిటౌన్, ఆగస్టు 28: పెద్దపల్లి జిల్లా కేంద్రంతో పాటు సుల్తానాబాద్‌లోని పలు నకిలీ అల్లోపతి వైద్యశాలల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. తెలంగాణ వైద్య మండలి ఛైర్మన్ డాక్టర్ మహేష్ కుమార్, రిజిస్ట్రార్ డాక్టర్ లాలయ్య ఆదేశాల మేరకు సభ్యులు డాక్టర్ రాజకుమార్ ఆధ్వర్యంలో టీజీఎంసీ తనిఖీ బృందం పెద్దపల్లి, సుల్తానాబాద్‌లలో నకిలీ అల్లోపతి వైద్యుల సెంటర్లపై బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పెద్దపల్లిలోని లోటస్ హాస్పిటల్, పురుషోత్తం, ఇమ్రాన్ బోన్ సెట్టింగ్స్ సెంటర్, వైఎస్ అజీజ్ క్లినిక్, సుల్తానాబాద్‌లోని నీలకంటేశ్వర్ మెడికల్ షాప్ మల్లేశం, మణికంఠ క్లీనిక్ చిన్న రమేష్ పేరుతో అర్హత లేకుండా పలు సెంటర్లు ఓపెన్‌చేసి వైద్యం చేస్తున్నారని వెలుగులోకి వచ్చిందని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. ఈ తనిఖీల గురించి సమాచారం తెలుసుకుని నకిలీ వైద్యులు తమ క్లీనిక్‌లు, ల్యాబ్స్, పర్మిషన్‌లేని మెడికల్ షాపులను మూసి వేశారని పేర్కొన్నారు. అర్హత లేనివారు వైద్యులుగా చెలామణి అవుతూ యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ ఇస్తునట్టు గుర్తించి తగిన ఆధారాలు సేకరించామని తెలిపారు. ఎన్ఎంసీ చట్టం ప్రకారం వీరిపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో హెచ్ఆర్‌డీఏ సెక్రటరీలు డాక్టర్ శరణ్‌సాయి, సందీప్, భరత్ పాల్గొన్నారు.

● **అధికారులు వెళ్లిన తర్వాత..**

అల్లోపతి పేరిట అనుమతులు, అర్హతలు లేకున్నా వైద్యం చేస్తున్న నకిలీ వైద్యులపై చర్యలు తీసుకుంటామని, క్లినిక్‌లు సీజ్ చేశామని ఓ వైపు అధికారులు ప్రకటించగా, వారు వెళ్లిన అనంతరం పోలీస్ స్టేషన్ పక్కనే ఉన్న చిన్నరమేష్‌తో పాటు పలు క్లినిక్‌లు తెరిచి యథావిధిగా వైద్యం చేస్తూ కనిపించడం కొసమెరుపు.



నిర్మాణం పూర్తయినా..నిరుపయోగమే

ప్రారంభం కాని ఆసుపత్రి భవనం

మల్యాల, ఆగస్టు 28: మల్యాల ప్రాథమిక ఆసుపత్రి ఆవరణలో నిర్మించిన నూతన ఆసుపత్రి భవనం నిరుపయోగంగా మారింది. అయిదేళ్ల క్రితం రూ.1.31కోట్లతో చేపట్టిన ఈ భవన నిర్మాణ పనులు పూర్తికావడంతో గత శాసనసభ ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి నప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. 2018లో ప్రారంభమైన పనులు ఏడాది క్రితం పూర్తయ్యాయి. ఈ ఆసుపత్రికి నిత్యం వందల సంఖ్యలో రోగులు వస్తుండగా సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైద్య సిబ్బందితో నిర్వహించే సమావేశాలను చెట్ల కింద నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. నూతన భవనంతో రోగులకు ఇక్కట్లు తొలిగిపోయే అవకాశం ఉండగా దాన్ని తెరవడం లేదు. ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని పలువురు పేర్కొంటున్నారు

ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు..

ప్రాజెక్టు	ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	ఔట్ ఫ్లో (క్యూసెక్కుల్లో)	పూర్తి సామర్థ్యం (టీఎంసీల్లో)	ప్రస్తుత నిల్వ (టీఎంసీల్లో)
శ్రీరాంసాగర్	5,440	3,822	80.5	53.620
ఎల్లంపల్లి	2,892	9,902	20.175	17.220
మిడ్ మానేరు	10,500	21,000	27.54	17.48
ఎల్ఎండీ	14.802	232	24.034	9.517

రాజకీయాలకు అతీతంగా పనిచేయాలి



కేడీసీసీ బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి పొన్నం, ప్రభుత్వ విప్ ఆది

- ఉమ్మడి జిల్లాలో 59 వేల రైతులకు రూ. 444 కోట్లు రుణమాఫీ చేశాం
- యువతకు విదేశీ విద్యా రుణాలు ఇచ్చేందుకు కేంద్రంతో మాట్లాడతాం
- బీసీ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

వేములవాడ టౌన్, ఆగస్టు 28: రాజకీయ పార్టీలకు అతీతంగా రాజకీయాలకు ఎలాంటి తావు లేకుండా సహకార సంఘాల్లో రైతుల హితం కోసమే మనమందరం పని చేయాలని బీసీ సంక్షేమ, రవాణాశాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వేములవాడలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం 300 మెట్రిక్ టన్నుల గోదాం, ప్యాక్స్ ఆన్‌లైన్ సర్వీస్ డిజిటల్ సేవా కామన్ సర్వీస్ సెంటర్, ది కరీంనగర్ జిల్లా సహకార బ్యాంక్ నూతన భవనాన్ని, ఏటీఎం సెంటర్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రూ. 2లక్షల రుణమాఫీ చేశామన్నారు. రైతు రుణమాఫీ కాక పోతే సహకార వ్యవస్థ ద్వారా ప్రభుత్వంతో సమ న్వయం చేసి రుణమాఫీ ఇప్పించాలని సూచించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి 59 వేల మంది రైతులకు రూ. 444 కోట్ల రుణమాఫీ జరిగిందన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ లక్ష రూపాయల రుణమాఫీ చేశారని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచి పోయారన్నారు. సహకార సంఘాలకు విదేశీ విద్య లోన్‌లు ఇచ్చే అర్హత లేదని అంటున్నట్లు తెలిసిందని, సహకార సంఘాల రైతుల పిల్లలు విదేశాల్లో చదువుకు నేందుకు లోన్‌లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతామని అన్నారు. గతంలో మహిళలకు పావలా వడ్డీ రుణాలు ఇవ్వలేదని, ఇప్పుడు మహిళలకు రుణాలు ఇస్తున్నామన్నారు. మహిళలకు వ్యవసాయ, వ్యవసాయ ఆధారిత చిన్న తరహా పరిశ్రమలు పెట్టుకోవటానికి సహకరిస్తున్నామన్నారు. వేములవాడ లాంటి ప్రాంతాల్లో సహకార సంఘాలు రూ. 150 కోట్ల వ్యాపారం చేస్తున్నారని, రూ. 35 కోట్ల డిపాజిట్‌లు చేయడం అభినందనీయమని అన్నారు.

వైఎస్సార్‌తోనే సహకార సంఘాలకు నూతన వైభవం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వైఎస్సార్ ముఖ్యమంత్రిగా వున్న సమయంలోనే సహకార సంఘాలకు నూతన వైభవం వచ్చిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. కేడీసీసీ బ్యాంకు నూతన భవనం ప్రారంభానికి పొన్నం ప్రభాకర్‌తో కలిసి హాజరైన ఆయన మాట్లాడుతూ సహకార బ్యాంకులు అన్ని వర్గాల వారికి వ్యక్తిగత రుణాలతో పాటు ఇతర దేశాల్లో చదువుకుంటున్న వారికి రుణాలు ఇచ్చే స్థాయికి ఎదగడం అభినందనీయమన్నారు. బ్యాంకు చైర్మన్‌లు అంకిత భావంతో పని చేయడం వల్లే సహకార బ్యాంకులు ఈ స్థాయిలో నిలుస్తున్నాయని అన్నారు. వాణిజ్య బ్యాంకులతో దీటుగా పోటీపడి సహకార బ్యాంకులు ముందుకు వెళ్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో నాఫ్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్, వైస్‌చైర్మన్ పింగలి రమేష్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంకు సీఈవో సత్యనారాయణరావు, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్లు ఏనుగు తిరుపతిరెడ్డి, కిషన్‌రావు, స్వామిరెడ్డి, అల్వాల కోటి, మేనేజర్ గుంటి సాయికుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, సీఈవో మిట్ల లక్ష్మణ్ కౌన్సిలర్లు, సంఘం చైర్మన్‌లు తదితరులు పాల్గొన్నారు.

- ఏటా 50లక్షల అదనపు భారం!
- ఏజన్సీల కైవసానికి పోటాపోటీ
- ప్రజాప్రతినిధుల చుట్టూ ప్రదిక్షణలు
- టెండర్ ద్వారానే నియామకాలకు కమిషనర్ ఆదేశాలు

అంజన్నకు 'ఏజెన్సీ'ల గుదిబండ



మల్యాల, ఆగస్టు 28: కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానానికి ఔట్‌సోర్సింగ్ నియామకాల ఏజెన్సీలు గుదిబండగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీలతో దేవస్థానానికి అదనంగా పెద్ద మొత్తంలో భారం పడే అవకాశం ఉండడమే ఇందుకు కారణం. ఇటీవల ఏజెన్సీల కోసం అనేక మంది పోటా పోటీగా ప్రయత్నాలు చేపట్టడం చర్చనీయంశంగా మారింది. కొందరు ప్రజాప్రతినిధుల అండతో ఏజెన్సీలను కైవసం చేసుకోవడానికి కొన్ని నెలలుగా ప్రయత్నాలు చేస్తుండడంతో కొండగట్టులో ఔట్‌సోర్సింగ్‌లో నియామకాలపై అనేక మంది ఆశలు పెంచుకుంటున్నారు.

గతంలో టెండర్ ప్రక్రియ ద్వారా సిబ్బందిని నియమించుకోగా ఇప్పుడు ఏజెన్సీలతో నియమించడం, దేవస్థానం పరిధిలో ఏజెన్సీ దక్కించుకోవడానికి ప్రజాప్రతి నిధుల చుట్టూ ప్రదిక్షణలు చేస్తూ ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. ఏజెన్సీలతో గతంలో కన్న ఇప్పుడు లక్షల్లో అదనంగా దేవస్థానానికి భారం పడుతుందని పలువురు హిందూ సంస్థల ప్రతినిధులు అంటున్నారు. కొండపైన సెక్యూరిటీ సిబ్బందిని గతేడాది క్రితం వరకు టెండర్ ద్వారా నియమించుకునే వారు. ఇప్పటి ఏజెన్సీ ఖరారు కాకముందు ఒక్కో సిబ్బందికి దేవస్థానం తరపున రూ.6 వేల చొప్పున వేతనాలు అందించగా ప్రస్తుతం ఏజెన్సీ ద్వారా నియమించిన సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.15 వేలు చెల్లిస్తున్నట్లు దేవస్థానం అధికారులు పేర్కొంటున్నారు.

గతంలో ఏజెన్సీకి ముందు 11మంది విధులు నిర్వహించగా ఇప్పుడు అదనంగా 9 మందిని మొత్తం 20 మందిని ఏజెన్సీ ద్వారా నియమించారు. దాంతో గతంలో కన్నా ఇప్పుడు దేవస్థానానికి పెద్ద మొత్తంలో భారం పడుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తూ అదనపు భారానికి ఇది ఉదాహరణగా చెబుతున్నారు. ఇదిలా ఉంటే గత జూన్ నెలతో ముగిసిన మరో ఏజెన్సీ స్థానంలో కొత్త ఏజెన్సీ కోసం కొందరు పోటీలు పడుతున్నట్లు తెలుస్తోంది. కనీస వేతనాలతో రోజు వారి భత్యంతో నియమించుకునే సిబ్బందిని ఏజెన్సీ ద్వారా నియమించుకోవడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల వరకు కొనసాగిన సిబ్బంది తమ విధులు కాకుండా ఆలయంతో విధుల కోసం రాజకీయ నాయకులతో సిఫారసులు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో తాము చేయాల్సిన నిర్ధేశిత విధులు పక్కన పెట్టేశారని పలువురు విమర్శిస్తున్నారు. రెండు నెలలుగా ఏజెన్సీ సిబ్బంది లేకపోయినా ఎలాంటి ఇబ్బందులు లేవని అలాంటప్పుడు ఏజెన్సీ ద్వారా వచ్చే సిబ్బంది నియామకాలు అంతగా అవసరం ఉండదనే అభిప్రాయాలను ఆలయ వర్గాలతో పాటు పలువురు వ్యక్తం చేస్తున్నారు.

● టెండర్ ద్వారానే నియామకాలు

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఆ పార్టీకి చెందిన కొందరు ఏజన్సీ దక్కించుకోవడం, ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం రావడం పాత ఏజెన్సీ గడువు ముగియడంతో అధికార పార్టీ నేతలు ఏజన్సీ కోసం జోరుగా ప్రయత్నాలు చేస్తున్నారు. అనేక మంది ఏజెన్సీల కోసం తమ చుట్టూ తిరుగుతుండడంతో ప్రజాప్రతినిధులు తలలు పట్టుకుంటున్నారు. అయితే ఇటీవల దేవాదాయ కమిషనర్ ఏజెన్సీ కాకుండా టెండర్ ద్వారా నియామకాలు చేపట్టాలనే ఆదేశాలు ఇవ్వడంతో ఇక ఏజెన్సీ ఉండదని తమ ప్రయత్నాలకు గడి పడుతుందని తెలియడంతో కొందరు ఏజెన్సీ కోసమేప్రయత్నాలు తీవ్రతరం చేస్తున్నట్లు తెలుస్తుంది.

కమిషనర్ నిర్ణయం మేరకే

రామకృష్ణరావు, ఈవో



టెండర్ ద్వారా సిబ్బందిని నియమించాలని తమకు దేవాదాయ కమిషనర్ నుంచి ఆదేశాలు వచ్చాయి. ప్రస్తుతం అయితే పలు ఆల యాల్లో చేపట్టిన నియామకాలను పరిశీలిస్తున్నాం. తదుపరి కమిషనర్ నిర్ణయం, ఉత్తర్వులు మేరకు తగు చర్యలు తీసుకుంటాం. గతంలో టెండర్ ద్వారా సిబ్బందికి వేతనాలు తక్కువే కాగ ఏజెన్సీలతో ప్రభుత్వం నిర్ధేశించిన కనీస వేతనాలు అందించాల్సి ఉంటుంది.

టెండర్ ద్వారానే నియామకాలు చేపట్టాలి

యాగండ్ల లక్ష్మీనారాయణ, విశ్వహిందూ పరిషత్



అవుట్ సోర్సింగ్‌తో రాజకీయ నాయకులు తమ అనుచరులను నియమించు కోవడం, పైగా దేవస్థానంకు ఏజెన్సీలతో ఏటా అరకోటికి పైగా భారం వాటిల్లుతుంది. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించకుండా ఈ నియమాకాలతో దేవస్థానం నిధులను ఖర్చు చేయడం సరి కాదు. భక్తులకు సౌక ర్యాల కల్పనతో పాటు సిబ్బందిని నియమించుకోవాలి. మిగితా దేవాలయాల్లో మాదిరిగా ఇక్కడ టెండర్ పద్ధతిలోనే నియమాకాలను చేపట్టాలి.

నార్కొటిక్ డాగ్‌తో విస్తృత తనిఖీలు



నార్కొటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్న సీఐ విజయ్‌కుమార్

కరీంనగర్ క్రైం, ఆగస్టు 28 : మత్తు పదార్థాలను పసిగట్టడంతో ప్రత్యేక శిక్షణ పొందిన నార్కొటిక్ డాగ్‌తో కరీంనగర్ రెండో ఠాణా సీఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నగరంలో పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం వదిలిపెట్టారు. నగరంలోని ముకరంపుర, కశ్మీరగగడ్డ, మంకమ్మతోట ప్రాంతాల్లోని అనుమానిత ప్రదేశాలు, పాన్ షాపులు, కిరాణంషాపులు, హోటళ్లలో నార్కొటిక్ డాగ్‌తో తనిఖీలు నిర్వహించారు. చాక్లెట్ రూపంలో కొందరు గంజాయిని, ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలలో నార్కొటిక్ స్క్వాడ్ పోలీసులతో పాటు రెండో ఠాణా ఎస్ఐ చీనానాయక్, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నాటు తుపాకులు తయారు చేస్తున్న వ్యక్తి అరెస్ట్

● కొనుగోలు చేసిన ముగ్గురు అదుపులోకి.. ● రెండు నాటు తుపాకులు, సామగ్రి స్వాధీనం ● ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్‌మహాజన్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 28: నాటుతుపాలకులు తయారుచేస్తున్న వ్యక్తితోపాటు కొనుగోలు చేసిన మరో ముగ్గురి అరెస్ట్ చేశామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం రాత్రి ఆయన వివరాలు వెల్లడించారు. గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్ అనే వ్యక్తి నాటు తుపాకులు తయారుచేసి వాటిని అదే గ్రామానికి చెందిన అడవి జంతువులను వేటాడే వారికి అమ్ముతున్నాడనే సమాచారం మేరకు అతని ఇంటికి వెళ్లి సోదాలు చేయగా నాటుతుపాకీల తయారీకి సంబంధించిన సామగ్రి లభించిందన్నారు. శంకర్ వద్ద రెండు తుపాకీ బ్యారెల్, తుపాకులు తయారు చేయడానికి వాడే రంపం, సుత్తి, కత్తి, ఆకురాయి, డ్రిల్లింగ్ మిషన్, దూగోడ మిషన్, ఎయిర్ బుల్లోజర్ స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు శంకర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా నాటుతుపాకులు కొనుగోలుచేసిన గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు చంద్రమౌళి, శాతవేణి హరీష్, లోగిడి గంగయ్యలను అదుపులోకి తీసుకొని వారి వద్ద రెండు తుపాకులు, నాలుగు ట్రిగర్ భాగాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు గంభీరావుపేట మండలంలోని గజసింగవరం గ్రామానికి చెందిన రాయలింగు శంకర్(50), రాయలింగు చంద్రమౌళి(40), శత్రవేణి హరీష్(27), లోకిడి గంగయ్య(45)లను అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరి అరెస్ట్‌నకు చాకచక్యంగా వ్యవహరించిన ఎల్లారెడ్డిపేట సిఐ శ్రీనివాస్, గంభీరావుపేట ఎస్ఐ రామ్మోహన్, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో సిరిసిల్ల డిఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



రాజ్ కుమార్ (ఫైల్)

బీర్‌పూర్, ఆగస్టు 28: మండలంలోని కొల్వాయి గ్రామానికి చెందిన బేగె రాజ్‌కుమార్ (26) అనే యువకుడు మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఏఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం రాజ్‌కుమార్ నాలుగు నెలల క్రితం జగిత్యాల మండలం గుల్లపెటకు చెందిన రాజశ్రీని ప్రేమ వివాహం చేసుకున్నాడు. రాజశ్రీ అత్త బోగె కమల, ఆడపడుచు సమలత వరకట్నం కోసం రాజశ్రీతో పాటు రాజ్‌కుమార్‌ను కొద్ది రోజులుగా వేధిస్తూ వస్తున్నారు. దీంతో మనస్థాపానికి గురై ఈ నెల 26నా ఉదయం రాజ్ కుమార్ గడ్డి మందు తాగాడు. వెంటనే జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు కరీంనగర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. రాజశ్రీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకుల అరెస్టు

ఇల్లంతకుంట, ఆగస్టు 28: పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన యువకులను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాల ప్రకారం మండలంలోని ఆరెపల్లి గ్రామంలో ఈ నెల 23న అనుమతి లేకుండా డీజే నడుపుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నారనే సమాచారం మేరకు ఏఎస్ఐ సతీష్‌కుమార్ సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకొని డీజేను నిలిపివేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆరెపల్లి గ్రామానికి చెందిన బుర్ర సూర్యగౌడ్, బుర్ర స్వామిచరణ్, సిరికొండ గ్రామానికి చెందిన నీలం మహిపాల్, రేపాక గ్రామానికి చెందిన పోతుగంటి సంజయ్ పోలీసులను నెట్టివేశారు. ఏఎస్ఐ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా డీజే పెట్టిన కేసన్నపల్లె గ్రామానికి చెందిన చిట్యాల హరీష్‌తో పాటు మిగతా నలుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

రెండు బైకులు ఢీ

యువకులకు తీవ్ర గాయాలు

ఎండపల్లి, ఆగస్టు 28: మండలంలోని జగిత్యాల రాజారాంపల్లి ప్రధాన రహదారి ఎండపల్లి వైన్స్ చౌరస్తా వద్ద బుధవారం రెండు బైకులు ఢీ కొట్టడంతో యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఎండపల్లికి చెందిన మంచికట్ల భీమయ్య, గుళ్లకోట గ్రామానికి చెందిన జనగిరి చిన్నయ్యగా వారిని గుర్తించారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు హుటాహుటిన అంబులెన్స్‌లో క్షతగాత్రులను జగిత్యాల ఆసుపత్రికి తరలించారు.

ప్రభుత్వ భూమిలో మట్టి తరలింపు

● అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



మట్టి తవ్వకాలను నిలిపివేస్తున్న అధికారులు

గంగాధర, ఆగస్టు 28: గంగాధర మండలం గోపాల్‌రావుపల్లిలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా మట్టితవ్వకాలను గ్రామస్థుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. గ్రామ శివారులోని వంటశాల గుట్ట వద్ద గతంలో ఉపాధి హామీలో ఈత,తాటి చెట్లతో పాటు పలు రకాల మొక్కలు నాటారు. ఈ మొక్కలను తొలగించి అక్రమంగా ప్రభుత్వ భూమిలో మట్టి తవ్వకాలు చేస్తున్నారని గ్రామస్థులు అధికారులకు సమాచారం అందించారు. విషయాన్ని తెలుసుకున్న రెవెన్యూ అధికారులు ఘటన స్థలానికి చేరుకుని లారీలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గ్రామానికి చెందిన వైకుంఠధామంకు ప్రహరీ నిర్మించగా దాన్ని తొలగించి అక్రమంగా మట్టితవ్వకాలను చేస్తూ అమ్ముకుంటున్నారని గ్రామస్థులు ఆరోపించారు.

గంజాయి విక్రయదారుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ మొగిలి

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 28: వేములవాడ మండలంలోని జయారం గ్రామానికి చెందిన డప్పుల వంశీ (23) అనే గంజాయి విక్రయదారుడిని బుధవారం అరెస్ట్ చేశామని సిరిసిల్ల రూరల్ సీఐ మొగిలి తెలిపారు. వంశీ ఇంటర్ వరకు చదువుకొని గంజాయికి అలవాటుపడి హైద్రాబాద్‌లోని సినిమాటోగ్రఫీ కోర్సు చేసే సమయంలో జల్సాలకు పాల్పడ్డాడన్నారు. అనంతరం వేములవాడకు వచ్చి ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడన్నారు. ప్రైవేట్ ఉద్యోగం చేస్తూనే తెలిసిన వ్యక్తుల దగ్గర గంజాయి కొని అందులో కొంత తాగి మిగిలిన గంజాయిని ఎక్కువ ధరలకు అమ్ముతూ డబ్బులు సంపాదించేవాడు. ఈ క్రమంలో ముస్తాబాద్‌లో గంజాయిని విక్రయిస్తుండగా సమాచారం రావడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి ముస్తాబాద్ వెళ్లారు. ఓ కల్యాణమండపం వద్ద అనుమానస్పదంగా కనిపించిన వంశీ వద్ద తనిఖీ చేయగా 100గ్రాముల గంజాయి లభించింది. గంజాయిని స్వాధీనం చేసుకుని ఇందుకు ఉపయోగించిన స్కూటీ, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేశారు. అనంతరం వంశీని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని ఆయన తెలిపారు.

కుటుంబ కలహాలతో దినసరి కూలీ ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 28: మండలంలోని రాచర్లబొప్పాపూర్ గ్రామంలో కుటుంబ కలహాలతో గుంజ గంగాధర్(30) అనే దినసరి కూలీ బుధవారం రాత్రి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామంలో గుంజ గంగాధర్ కొంత కాలంగా ఓ ఇంటిని అద్దెకు తీసుకుని దినసరి కూలీగా పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. కూలీ పనులు లభించక మద్యానికి బానిసయ్యాడు. కొంత కాలంగా ఇంటిలో భార్యాభర్తల నడుమ గొడవలు జరుగుతున్నాయి. పనులు చేయకపోతే కుటుంబ పోషణ గడవడం కష్టంగా మారుతోందని భర్త గంగాధర్‌ను భార్య స్వప్న మందలించింది. దాంతో మనస్తాపం చెందిన గంగాధర్ ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య స్వప్న, ఇద్దరు కొడుకులు శరత్, వరుణ్‌తేజ ఉన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

తిమ్మాపూర్, ఆగస్టు28: అక్రమంగా కబేలాలకు ఆవుల తరలింపు కొనసాగుతూనే ఉంది. మంగళవారం తెల్లవారుజామున ఎల్ఎండీ పోలీసులు, ఎస్‌పిఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని రేణికుంట టోల్‌గేట్ వద్ద ఓ లారీలో అక్రమంగా తరలిస్తున్న 48 ఆవులను పట్టుకొని ఎల్ఎండీలోని గోశాలకు తరలించగా అందులో ఊపిరి ఆడక అస్వస్థతకు గురై ఆరు మృతిచెందాయి. ఈ ఘటన మరువకముందే బుధవారం మరికొన్ని ఆవులను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. తిమ్మాపూర్ సిఐ కె. స్వామి తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం నుంచి హైదారాబాద్ వైపునకు ఆవులను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు వాహనాలను తనిఖీ చేస్తున్న క్రమంలో బుధవారం కంటెయినర్‌లో 24 ఎద్దులు, 4ఆవులు తరలిస్తున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఆవులను తరలిస్తున్న వాహనం తప్పించుకునే ప్రయత్నంలో సిద్దిపేట జిల్లా గౌరారం పోలీస్‌స్టేషన్ సమీపం వరకు వెళ్లగా, పోలీసులు వారిని వెంబడించి పశువులను తరలిస్తున్న లారీని పట్టుకొని ఎల్ఎండి కాలనీలో గల గోశాలకు తరలించారు. పట్టుకున్న లారీలో 24 ఎద్దులు, 4ఆవులు మొత్తం 28 పశువులు ఉన్నాయి. రెండు రోజులలో మొత్తం 76 పశువులు పట్టుకున్నారు. ఇప్పటి వరకు 10పశువుల వరకు మృతి చెందాయి. పశువులను తరలిస్తున్న ఓనర్ సద్దం, లారీ డ్రైవర్ ఆసిఫ్, లేబర్లు సమీర్, తాహిద్‌లపై ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ స్వామి తెలిపారు.



మృతి చెందిన ఆవులు

నేడు స్పోర్ట్స్ డేలో పాల్గొననున్న మంత్రి పొన్నం

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 28: స్పోర్ట్స్‌డే సందర్భంగా కరీంనగర్ స్పోర్ట్స్ స్కూల్‌లో గురువారం నిర్వహించే కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. కరీంనగర్ శివారులోని ఉజ్వలపార్క్ దగ్గర స్పోర్ట్స్ స్కూల్‌లో ఉదయం 8 గంటలకు స్పోర్ట్స్ డే కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు.

అర్బన్ పాఠశాలల క్రీడోత్సవాలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఆగస్టు 28: కరీంనగర్ అర్బన్ పాఠశాలల క్రీడోత్సవాలు ఈన ఎల 30వ తేదీ నుండి నిర్వహిస్తున్నట్లు మండల విద్యాధికారి మధుసూదనాచారి, మండల క్రీడోత్సవాల కన్వీనర్ అంతటి శంకరయ్యలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30 నుండి సెప్టెంబర్ 6వ తేదీ వరకు డాక్టర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 29వ తేదీ రెండు గంటల వరకు పూర్తి వివరాలతో ఎంట్రీలు అందించాలన్నారు. పూర్తి వివరాలకు శంకరయ్య సెల్ నెం.9849114956 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

సీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రతిష్ఠాపనోత్సవాలు



శ్రీరాంనగర్ కాలనీలో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 28:నగరంలోని శాతవాహన యూనివర్సిటీ సమీపంలో శ్రీరామనగర్ కాలని, రోడ్ నెం-7లో ఆలయ కమిటీ, శ్రీరామ వేల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన శ్రీసీతారామచంద్రస్వామి మందిర ప్రతిష్ఠా కార్యక్రమాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. గోదావరిఖనికి చెందిన వేదపండితుడు, యజ్ఞాచార్యుడు గోవర్ధనగిరి జగన్నాథాచార్యుల బృందం ఆధ్వర్యంలో ఉదయం శ్రీరామనగర్ కాలనీ వీధుల్లో విగ్రహాల ఊరేగింపు వైభవంగా జరిగింది. సాయంత్రం వాసుదేవ పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, పంచామృత అధివాసము, హవనం, యాగశాలా ప్రవేశం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు డి మాధవరావు, గజవాడ ఆంజనేయులు, కోశాధికారి నరసింహాచారి పాల్గొన్నారు.

కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై శిక్షణ

కరీంనగర్ క్రైం, ఆగస్టు 28: గీతకార్మికుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకువచ్చిన కాటమయ్య రక్షణ కవచం వినియోగంపై గీతకార్మికులకు కరీం నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పి శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారి అనిల్‌ల ఆధ్వర్యంలో బుధవారం శిక్షణ అందించారు. కొత్తపల్లి మండలం లక్ష్మీపూర్ గ్రామంలో 25 మంది గీత కార్మికులకు రాక్, మౌంటెన్ క్లైంబింగ్‌లో నిష్ణాతులైన శిక్షకుల ద్వారా కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ మోకు) ఉపయోగించు విధానం, మెలకువలు నేర్పించారు. గీత కార్మికులు ఎలాంటి ప్రమాదాల బారిన పడకుండా వారి రోజువారీ వృత్తిని కొనసాగించేందుకు ఈ శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ సీఐ అశోక్ కుమార్, ఎస్ఐ లక్ష్మన్, ఎక్సైజ్ సిబ్బంది, గీతకార్మికులు తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

కరీంనగర్ క్రైం, ఆగస్టు 28: యువత, విద్యార్థులు మత్తు పదార్థాల బారిన పడి వారి ఉజ్వల భవిష్యత్‌ను చేజేతులా నాశనం చేసుకోవద్దని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ ఎస్ఐ విజయభాస్కర్ సూచించారు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలోని జిల్లాపరిషత్ హైస్కూల్‌లో కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో బుధవారం మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రభుత్వ వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా కవిత

భగత్‌నగర్, ఆగస్టు 28: కరీంనగర్ ప్రభుత్వ వైద్యకళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా డాక్టర్ టి కవిత బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె కలెక్టర్ పమేలా సత్పతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా నియమితులైన కవితను కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శంతన్ కుమార్, డాక్టర్ సుమన్, డాక్టర్ దివ్య, డాక్టర్ రవిప్రవీణ్‌రెడ్డి, డాక్టర్ నవీన, డాక్టర్ శేఖర్‌రావు, డాక్టర్ భవాని, డాక్టర్ రాజకుమార్, డాక్టర్ సుహేల, డాక్టర్ కరుణశ్రీ సత్కరించారు.

ప్రబలుతున్న విషజ్వరాలు

● దుర్శేడులో డెంగీ కేసు నమోదు

కరీంనగర్ రూరల్, ఆగస్టు28: కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సీజనల్ వ్యాధులు తీవ్రంగా ప్రబలుతున్నాయి. కొందరికి ఒళ్లు నొప్పులతో జ్వరాల బారిన పడుతుండగా, మరి కొందరు జలుబు, జ్వరాలతో బాధపడుతున్నారు. వీరందరూ ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్సలు చేపించుకుంటున్నారు. దుర్శేడ్ గ్రామానికి చెందిన పి మహేష్ అనే వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయింది. గత మూడు రోజులుగా జ్వరంతో బాధపడగా కరీంనగర్‌లోని ప్రవేటు ఆసుపత్రిలో చేర్పించారు. రక్త పరీక్షలు చేయించగా డెంగీ నిర్ధారణ అయింది.

9 టీఎంసీలు దాటిన ఎల్ఎండీ నీటి మట్టం

తిమ్మాపూర్. ఆగస్టు28:కరీంనగర్ పరిధిలోని దిగువ మానేరు జలాశయంలోకి ఎంఎంఆర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. ఎల్ఎండి పూర్తి స్థాయి నీటి మట్టం 24.034 టీఎంసీలు కాగా బుధవారం సాయంత్రం 6గంటల సమయంలో 9.397 టీఎంసీల నీరు ఉంది. ఎంఎంఆర్ నుంచి 14,600క్యూసెక్కులు, మోయతు మ్మెద వాగు ద్వారా 202 క్యూసెక్కులు మొత్తం 14,802క్యూసెక్కుల నీరు ఎల్ఎండీలోకి వస్తున్నట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు.

మూడు పంపుల ద్వారా నీటి విడుదల

రామడుగు, ఆగస్టు 28: మండలంలోని లక్ష్మీపూర్ గాయత్రి పంప్‌హౌస్ నుంచి శ్రీ రాజరాజేశ్వర మిడ్ మానేరు జలాశయానికి నీటి విడుదల కొనసాగుతోంది. బుధవారం మూడు పంపుల ద్వారా 9,450 క్యూసెక్కుల నీటిని ఎస్ఆర్ఆర్ డ్యామ్‌కు తరలించారు. గాయంత్రి పంప్‌హౌస్ నుంచి రాజరాజేశ్వర జలాశయానికి 21 టీఎంసీల నీటిని ఇప్పటి వరకు తరలించినట్లు అధికారులు తెలిపారు.

విద్యార్థులు చదువుపై శ్రద్ధచూపాలి : డీఈవో

హుజూరాబాద్‌రూరల్, ఆగస్టు 28: విద్యార్థులు చదువుపై శ్రద్ధ చూపాలని జిల్లా విద్యాశాఖాధికారి సిహెచ్ ఎస్. జనార్ధన్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ప్రతి టీచర్ విద్యార్థులను దత్తత తీసుకొని వారు ఎలా చదువుతున్నారో చూస్తూ అన్ని రంగాల్లో రాణించేలా తర్ఫీదు ఇవ్వాలన్నారు. చదువులో చురుకైన విద్యార్థులకు చిన్న తరగతి విద్యార్థులను అటాచ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో చిల్లప్ప అనురాధ, బేతి తిరుపతిరెడ్డి, ఆవుల పద్మశ్రీ, ఆవుల వెంకటరమణ, ఇర్రి శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌బాబు, సత్యానందం ఉన్నారు.

వ్యవసాయ క్షేత్రాలను సందర్శించిన వ్యవసాయ అధికారి

చొప్పదండి, ఆగస్టు 28: మండలంలోని గూమ్లాపూర్‌లో పత్తి, వరి పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి సాగు వివరాలను తెలుసుకున్నారు. అనంతరం చొప్పదండిలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వంశీక్రిష్ణ , ఏఈఓలు పాల్గొన్నారు.

శ్రీ చైతన్య, వాగేశ్వరి కళాశాలల్లో ఓరియంటేషన్ ప్రోగ్రాం

తిమ్మాపూర్, ఆగస్టు28: శ్రీచైతన్య, వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాలల్లో నూతనంగా ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరంలో చేరుతున్న విద్యార్థులకు బుధవారం ఓరియంటేషన్ ప్రోగ్రం నిర్వహించారు. శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి మాట్లాడుతూ కళాశాలలో ఉన్న అధునాతన సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని ఉన్నతంగా ఎదగాలని అకాంక్షించారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ శశికాంత్, అధ్యాపకులు పాల్గొన్నారు.

● వాగేశ్వరి విద్యాసంస్థల ప్రధాన కార్యదర్శి గంద్రా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు టెక్నికల్, నాన్ టెక్నికల్ కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలని అన్నారు. క్రమశిక్షణతో మెలగాలని, ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి డి.శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు..

జాతీయ స్థాయి సాఫ్ట్‌బేస్ బాల్ పోటీలకు అల్ఫోర్స్ విద్యార్థుల ఎంపిక

రామడుగు, ఆగస్టు 28: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె. అశ్విత్, 8వ తరగతి చదువుతున్న వరుణ్, స్రవంతిలు జాతీయస్థాయి సాఫ్ట్‌బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 10న మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. అక్టోబర్‌లో హర్యానాలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థులను చైర్మన్, హెచ్ఎం అభినందించారు.

అమరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం



బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

గణేశ్‌నగర్, ఆగస్టు 28: అమరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. బషీర్‌బాగ్ విద్యుత్ పోరాటంలో అమరవీరులైన బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ చిత్రపటాలకు తెలంగాణ చౌక్ వద్ద వామపక్ష పార్టీల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న హయాంలో విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆందోళన చేస్తుంటే కాల్పులు జరిపారన్నారు. ఈ కాల్పుల్లో బాలస్వామి, రామకృష్ణ విష్ణువర్ధన్ అమరులు కాగా అనేకమంది గాయాలపాలయ్యారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే దిశగా అడుగులు వేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై విద్యుత్ పోరాట అమరవీరుల స్ఫూర్తితో ఉద్యమిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు నరేష్ పటేల్, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు,కిన్నెర మల్లమ్మ, సిపిఎం నాయకులు తిరుపతి, శ్రీకాంత్, పున్నం రవి, సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు సదానందం, న్యాలపట్ల రాజు, సదాశివ, సిపిఎం నాయకులు రాయి కంటి శ్రీనివాస్, రోహిత్, బోగేష్, ఆకాష్, సిపిఐ నాయకులు యుగేందర్, మచ్చ రమేష్ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భగతనగర్, ఆగస్టు 28: ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్స్, స్వీపర్ హౌస్‌కీపింగ్, వాచ్‌మెన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి యూనియన్ గౌరవ అధ్యక్షుడు పున్నం రవిఅన్నారు. బుధవారం లేబర్ కమిషర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌కు మనోజ్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్త డిమాండ్స్ డే సందర్భంగా వినతిపత్రం అందించామన్నారు. కార్యక్రమంలో దావు అంజిరెడ్డి, శ్రీధర్, గడ్డం సమ్మయ్య పాల్గొన్నారు.

శ్రీకృష్ణాష్టమి వేడుకలు

భగత్‌నగర్, ఆగస్టు 28: కొత్తపల్లి పట్టణకేంద్రంలోని శారదా విద్యానికేతన్‌లో బుధవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు చిన్నకృష్ణుడు, గోపిక వేషధారణలతో అలరించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం ఊట్కూరి సత్యనారాయణగౌడ్, బోగ మునీందర్, గాలిపల్లి లింగమూర్తి పాల్గొన్నారు.

రుణ మాఫీ కాని రైతుల దరఖాస్తుల స్వీకరణ

కరీంనగర్ రూరల్, ఆగస్టు 28: కరీంనగర్ రూరల్ మండలంలో రుణమాఫీ కాని రైతుల నుంచి మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సత్యం నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. రైతుల నుంచి కుటుంబ సభ్యుల నిర్ధారణ గ్రివెన్స్ యాప్‌లో ఆన్‌లైన్ కార్యక్రమాన్ని చేపట్టారు. కరీంనగర్ రూరల్ మండలంలో 17గ్రామ పంచాయతీల రుణమాఫీ కాని రైతులు ఇప్పటి వరకు ఆయా గ్రామాల నుంచి 718 మంది దరఖాస్తులను సమర్పించారు. ప్రస్తుతం కుటుంబ సభ్యుల ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ఎలాంటి షరతులు లేకుండా నేరుగా రుణమాఫీ చేయాలని మండలంలోని రుణమాఫీ కాని రైతులు కోరుతున్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

భగత్‌నగర్, ఆగస్టు 28: ముఖ్యమంత్రి విద్యారంగంపై సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏఐఎస్ఎఫ్ సమా వేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రిగా ఉన్న కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌లో కేంద్ర విద్యాసంస్థలు ఏర్పాటు అయ్యేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్, జిల్లా కార్యదర్శి మచ్చరమేష్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి హేమంత్ పాల్గొన్నారు.

పరిశోధక ఆణిముత్యం 'ముత్యం'

కరీంనగర్ కల్చరల్, ఆగస్టు 28: ఇటీవల మరణించిన శాతవాహన విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షుడు డాక్టర్ కె ముత్యం ఓ పరిశోధక ఆణిముత్యమని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై సత్యనారాయణ అన్నారు. బుధవారం కళాశాలలో ముత్యం యాదిలో తెలుగు విభాగం తరఫున నివాళి-సాహిత్య సమావేశం ఏర్పాటు చేశారు. బహుభాషావేత్త డాక్టర్ నలిమెల భాస్కర్ మాట్లాడుతూ ముద్యం స్వయంగా వ్యయ ప్రయాసలకోర్చి 28 పుస్తకాలను ప్రచురించారన్నారు. కార్యక్రమంలో కవి అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు, అధ్యాపకులు డాక్టర్ బి ప్రకాశ్, డాక్టర్ రాపర్తి శ్రీనావాస్, మెట్టు వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



అంగన్‌వాడీ కేంద్రంలో పెయింటింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

భగత్‌నగర్, ఆగస్టు 28: కొత్తపల్లి మండలంలోని మల్కాపూర్ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ పమేలా సత్పతి పరిశీలించారు. చిన్నారులను ఆకట్టుకునేలా అంగన్‌వాడీ కేంద్రానికి వేయించిన పెయిం టింగ్స్‌ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఇదే విధంగా పెయింటింగ్స్ వేయించాలన్నారు. అంగన్‌వాడీ ప్రాథమిక పాఠశాల బోర్డులను ఏర్పాటు చేయించాలని జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఎం సరస్వతి, జిల్లా వైద్యాధికారి సుజాత, ఎంపిడిఓ ప్రభు, ఎంపిఓ పివి నర్సింహారెడ్డి, కొత్తపల్లి వైద్యాధికారి నాజియా తదితరులు పాల్గొన్నారు.

అమెరికా పర్యటనపై 'వెలిచాల' విమర్శలు సరికావు

- నగర పాలక సంస్థ మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ టౌన్, ఆగస్టు 28: కొత్త బిచ్చగాడు పొద్దు ఎరగనట్టుగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు వెలిశాల రాజేందర్‌రావు తన అమెరికా పర్యటనపై విమర్శలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సంవత్సరంలో 365 రోజులు కరీంనగర్‌లో ప్రజల మధ్య ఉండి ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామన్నారు. 'ఎన్నికల సమయంలో కనబడే పొలిటికల్ టూరిస్టువు నువ్వు. నీకు ప్రజల మీద గాని ప్రజా సమస్యల మీద గానీ అవగాహన లేదన్నారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ పంచన చేరి కాంటాక్టుల పేరుతో ప్రజాధనాన్ని దోచుకోవడం... దాచుకోవడం నీకు మాత్రమే తెలుసు. దాచుకున్న డబ్బుతోనే ఎన్నికలు వచ్చిన ప్రతిసారి నగరానికి వచ్చి ఎన్నికల్లో నిలబడి ప్రజల చేత తిరస్కరించబడే వ్యక్తి నువ్వు. నీకు నా పైన విమర్శలు చేసే అర్హత లేదు. నీకు దమ్ము, ధైర్యం ఉంటే ముందు కరీంనగర్‌లో ఉండే అలవాటు చేసుకో అన్నారు. విమర్శలు చేసే ముందు వాస్తవాలు ఏమిటో తెలుసుకొని మాట్లాడాలి' అని మేయర్ అన్నారు.

డిప్యూటీ మేయర్ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధం

- మేయర్ పదవికి రాజీనామా చేస్తావా? - సునీల్‌రావుకు డిప్యూటీ మేయర్ సవాల్



మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి

కరీంనగర్ టౌన్, ఆగస్టు 28: రాజకీయ కాంక్ష ఎవరిదో కరీంనగర్ ప్రజలకు తెలుసునని, తాను డిప్యూటీ పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని, సునీల్‌రావు తన పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమా అంటూ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణిహరిశంకర్ సవాల్ విసిరారు. డివిజన్ కార్యాలయంలో బుధవారం ఆమె, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్‌తో కలిసి మీడియా సమావేశంలో మేయర్ సునీల్‌రావుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అమెరికా నుంచి పంపిన వీడియోలో నన్ను అవమానించే విధంగా మాట్లాడావని, దీనిపై మహిళా కమిషన్‌ను ఆశ్రయిస్తామని చల్లస్వరూపరాణి స్పష్టం చేశారు. చల్ల హరిశంకర్ మాట్లాడుతూ వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్ సునీల్‌రావు అని విమర్శించారు. ఇకనైనా నీ తప్పు తెలుసుకొని విమర్శించడం మానుకోవా లని, మాపై ఎలాంటి తప్పుడు ఆరోపణలు చేసినా ఊర్కొనేది లేదని, ఎంత దూరమైనా పోరాటానికి సిద్ధంగా ఉంటామని హరిశంకర్ హెచ్చరించారు.

డివిజన్‌లో 4,661 మందికి రుణమాఫీ కావాల్సి ఉంది



మాట్లాడుతున్న ఏడీఏ సునీత

హుజూరాబాద్, ఆగస్టు 28: హుజూరాబాద్ డివిజన్‌లో 4,661మందికి రుణమాఫీ కావాల్సి ఉందని, సభ్యుల జాబితాను వ్యవసాయ శాఖ అధికారుల లాగిన్‌లో పొందుపరిచామని ఏడీఏ సునీత అన్నారు. బుధవారం హుజూరాబాద్‌లోని ఏడీఏ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ వ్యవసాయ శాఖకి రుణమాఫీ కొరకు వచ్చిన ఫిర్యాదులో అధిక మొత్తంలో కుటుంబ నిర్ధారణపైన రావడం జరిగిందన్నారు. దీని కోసం ప్రభుత్వం వ్యవసాయ శాఖ నుంచి ఒక యాప్‌ను రూపొందించారన్నారు. ఎవరికైతే నిర్ధారణ జరగాల్సి ఉందో సంబంధిత వ్యవసాయ శాఖాధికారి నుంచి నిర్ధారణ చేయడం జరుగుతుందన్నారు. దీని కోసం సంబంధిత ఆఫిడవిట్ ఫారం (రైతు ధ్రువీకరణ పత్రం)ను నింపి స్వీయ నిర్ధారణ సంతకం చేసి వ్యవసాయ అధికారి నుంచి యాప్‌లో పొందుపరచుకోవాలన్నారు. వ్యవసాయ అధికారి గ్రామాల వారీగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం రైతులు ఆయా గ్రామాలలో కుటుంబ నిర్ధారణ చేసుకోవచ్చన్నారు. ఇతర ఫిర్యాదులు ఆధార్ నంబర్ మార్పు లాంటివి నేరుగా బ్యాంకుకు వెళ్లి సరిచేసుకోవచ్చన్నారు.

● నేటి నుంచి రుణమాఫీ ఎంపిక సర్వే

గంగాధర: మండలంలో గురువారం నుంచి గ్రామాల్లో రుణమాఫీ తీసుకుని రేషన్‌కార్డులేని వారి కోసం సర్వే నిర్వహిస్తున్నట్లు ఏవో శ్రీనివాస్ తెలిపారు. 29న కాచిరెడ్డిపల్లి, కొండయ్యపల్లి, చర్లపల్లి(ఆర్), ర్యాలపల్లి,30న బూరుగుపల్లి, లింగంపల్లి, నర్సింహులపల్లి,సర్వారెడ్డిపల్లి, ముప్పిడినర్సయ్యపల్లి, 31న కొండన్నపల్లి, మంగపేట, ఇస్లాంపూర్, వెంకటయ్యపల్లి, సెప్టెంబరు2న మల్లాపూర్, గోపాల్‌రావుపల్లి, వెంకంపల్లి, ఉప్పరమల్యాల, 3న నాగిరెడ్డిపూర్, నారాయణపూర్, లక్ష్మీదేవిపల్లి, చర్లపల్లి(ఎన్),4న గంగాధర, కురిక్యాల, 5న హిమ్మత్‌నగర్, రంగరావుపల్లి, తాడిజెర్రి, కాసారం, 6న గట్టుబూత్కూర్, గర్శకుర్తి,9న ఆచంపల్లి,చిన్నాచంపల్లి, ఒద్యారం, 10న మధురానగర్‌లలో గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేకు ఆధార్ కార్డు తీసుకుని అందుబాటులో ఉండాలని, వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు.

ఆర్డీవో విచారణ

శంకరపట్నం, ఆగస్టు 28: మండలంలోని మొలంగూర్ గ్రామపంచాయతీ పరిధిలోని నల్ల వెంకటయ్యపల్లెకు చెందిన పొద్దుటూరు శంకరమ్మ కుమారుడు వీరారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వీరారెడ్డికి సంబంధించిన ఆస్తిని జమున వారి కూతుళ్లకు తప్పుడు పత్రాలు సృష్టించి విరసాత్ చేశారని, ఆ విరాసత్ రద్దు చేయాలని మృతుడు వీరారెడ్డి తల్లి శంకరమ్మ వారి కుటుంబ సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఆర్డీవో రమేష్ గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ జరిపారు. సంబంధిత పత్రాలను పరిశీలించారు. నివేదికను తయారు చేసి కలెక్టర్‌కు సమర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్ ఉన్నారు.

కల్లుగీత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

చిగురుమామిడి,అగస్టు 28: కల్లు గీత కార్మికుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని కల్లు గీత కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు తాళ్లపెల్లి తిరుపతిగౌడ్ పేర్కొన్నారు. సుందరగిరిలో గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచ కిట్లను బుధవారం పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు తమ సామాజిక వర్గం రుణపడి ఉంటుందన్నారు. గౌడ సంఘం మండల అధ్యక్షుడు బండారు పల్లి చంద్రం, తాళ్లపెల్లి సంపత్‌గౌడ్, బుర్ర తిరుపతి ఉన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో ప్రథమస్థానంలో నిలపాలి

గన్నేరువరం, ఆగస్టు 28: బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మండలంలో అత్యధిక సభ్యత్వాలను చేసి జిల్లాలోనే ప్రథమస్థానంలో మండలాన్ని నిలపాలని బీజేపీ మానకొండూరు అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ ఆధ్వర్యంలో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. బీజేపి జిల్లా నాయకులు మచ్చ బాలరాజు, మండల నాయకులు పర్శరాంగౌడ్, వెంకటేష్, సత్తయ్య, తిరుపతి పాల్గొన్నారు.

బీఎల్‌వోలు ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలి

● అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్

తిమ్మాపూర్, ఆగస్టు28: బీఎల్‌వోలు ఓటరు నమోదు పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మికిరణ్ ఆదేశించారు. బుధవారం తిమ్మాపూర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరములో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించగా ఈ కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీ కిరణ్ హాజరై మాట్లాడారు. బీఎల్‌వో ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ల సర్వే చేయాలన్నారు. 18 నిండిన వారితో పాటు ఎవరైనా కొత్త ఓటర్లు ఉంటే వారి వివరాలను ఫాం 6లో నమోదు చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో పేరు ఉన్న వ్యక్తి మరణించి ఉంటే వారికి ఫాం 7లో వారి వివరాలు నమోదు చేయాలని దానికి వారి మరణ ధ్రువీకరణ పత్రం జతచేయాల్సి ఉంటుందని, లేని పక్షంలో సంబంధిత కుటుంబం వారి వాగ్మూలం తీసుకొని జతచేయలని సూచించారు. ఇంటి నంబర్లు, ఇతర వివరాలు మార్పులు, చేర్పులు ఉంటే ఫాం 8లో వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ విజయ్ కుమార్, ఎంపిడివో విజయ్ కుమార్, ఇతర అధికారులు, బిఎల్‌వోల సూపర్ వైజర్లు.. బిఎల్‌వోలు పాల్గొన్నారు.

● మానకొండూర్ : ఇంటింటి సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి బి. రాజేశ్వరీ రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. మానకొండూర్ తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం మండలంలోని వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. 18ఏళ్లు నిండిన యువతీ, యువకులను ఓటరు నమోదు చేయించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గణేశ్‌నగర్, ఆగస్టు 28: నగరంలో విద్యుత్ లైన్ పనులలో భాగంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నగరంలో వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ టు ఏడీఈ సుధీర్ కుమార్ తెలిపారు. ఇండస్ట్రియల్ ఏరియా, పద్మనగర్, ప్రోస్టాప్ ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతం, ప్రగతినగర్, సాయిబాబా ఆలయ ప్రాంతం ఏరియా, వివిధ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

భగత్‌నగర్, ఆగస్టు 28: కొత్తపల్లి మండలంలోని అల్ఫోర్స్ ఈ-టెక్నో పాఠశాలలో బుధవారం వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం మండల విద్యాధికారి వేణుకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు, ఎస్‌జిఎఫ్ మండల కార్యదర్శి గిన్నె లక్ష్మణ్ మాట్లాడుతూ అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో సెప్టెంబర్ 3వ తేదీ న బాలికల విభాగంలో అండర్-14, 17 ఖోఖో, కడడ్డీ, వాలీబాల్, 4వ తేదీన బాలురకు అండర్-14, 17 ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ ఎంపికపోటీలు నిర్వహిస్తామన్నారు. సెప్టెంబర్ 6వ తేదీన అంబేద్కర్ స్టేడియంలో అండర్-14, 17 బాల బాలికలకు అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

కార్మికులకు మౌలిక వసతులు కల్పించాలి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 28: కరీంనగర్ మునిసిపల్ కార్మికులకు కనీస మౌళిక వసతులు కల్పించాల్సిన బాధ్యత బల్దియాదేనని డీసీసీ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వీటికి సంబంధించిన బడ్జెట్ నగరపాలక సంస్థ కేటాయించి వెంటనే కార్మికులకు అన్ని వసతులు కల్పించాలని బల్దియా అధికారులను కోరారు.

తెలంగాణ హక్కుల సాధనకు పోరాడే నేత అభిషేక్ సింఘ్వి

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 28: తెలంగాణ కోటాలో రాజ్యసభ సభ్యుడిగా కాంగ్రెస్ జాతీయ అధికార ప్రతినిధి అభిషేక్‌మను సింఘ్వి ఎంపిక కావడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి రావాల్సిన హక్కుల సాధనకు కేంద్ర ప్రభుత్వంపై పోరాడి సాధించే సత్తా ఉన్న నేత అభిషేక్ సింఘ్వి అని చెప్పారు.

'బీజేపీ, బీఆర్ఎస్ రహస్య ఒప్పందం'

కరీంనగర్ అర్బన్, ఆగస్టు 28: లిక్కర్ కుంభకోణంలో ఎమ్మెల్సీకి కండిషన్ బెయిల్ రావటంతో కడిగిన ముత్యమెలా అవుతారని జిల్లా కాంగ్రెస్ ఓబీసీ సెల్ చైర్మన్, పులి ఆంజనేయులు గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లిక్కర్ కుంభకోణంలో ఎమ్మెల్సీ కవితకు కండిషన్ బెయిల్ రావడంలో బీజేపీ, బీఆర్ఎస్ రహస్య స్నేహం ఉందని రాష్ట్రవ్యాప్తంగా రాజకీయాలకతీతంగా చర్చ జరుగుతుందన్నారు.

ప్రజా సమస్యలపై పోరాడుదాం

సుభాష్‌నగర్, ఆగస్టు 28: ప్రజల కోసం రాజకీయ పార్టీలు పనిచేయడం లేదని ప్రజా సమస్యలపై పోరాడుదామని రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ అన్నారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలంయలో ఉత్తర తెలంగాణ ముఖ్య నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కాశిపాక అజయ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కారుకురి శ్రీనివాస్, మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు మొగురం మిరియ, తెలంగాణ లేబర్ యూనియస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగె కొమురయ్య మొగిలి సతీష్, వెంకటపతి పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ కార్యవర్గానికి సన్మానం

సుభాష్‌నగర్, ఆగస్టు 28: మానకొండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గాన్ని ఘనంగా సన్మానించారు. బుధవారం నగరంలో నిర్వహించిన కార్యక్రమంలో యాదవ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బండి మల్లయ్య ఆధ్వర్యంలో నూతన కమిటి చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాస్ యాదవ్, వేల్పొండ రాజుయాదవ్‌లను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొమురయ్య, మల్లేశం పాల్గొన్నారు.

సన్మానం

హుజూరాబాద్, ఆగస్టు 28: హుజూరాబాద్ పట్టణంలోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో బుధవారం ఎస్సీ డిపార్ట్‌మెంట్ అట్రాసిటీస్ రాష్ట్ర ఇన్‌చార్జి తిప్పారపు సంపత్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వసంత్, రామచంద్రం, శ్రీనివాస్, రవీందర్, మల్లయ్య, రత్నం, రామారావు, సదానందం, రాజయ్య, ప్రభాకర్, సతీష్, రఘుపతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపు

ఇల్లందకుంట, ఆగస్టు 28: మండలంలోని మల్యాల గ్రామంలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్వరపీడితుల రక్తన మూనాలు తీసుకొని పరీక్ష పంపించారు. కార్యక్రమంలో డాక్టర్ తులసిదాస్, సీహెచ్‌వో శ్యామల, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్ అరుణ, ఉమా పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో కౌన్సిలింగ్ రేపు

మానకొండూర్, ఆగస్టు 28 : మండలంలోని దేవంపల్లి గురుకుల పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ స్పాట్ కౌన్సిలింగ్ ఈ నెల 30న నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యాదగిరి తెలిపారు. మొదటి సంవత్సరం బైపీసీలో ఎస్సీలకు 4, ఎస్టీలకు 2, బిసిలకు 2 మొత్తం 8సీట్లు ఖాలీ ఉన్నట్లు తెలిపారు. పదవతరగతిలో 8జిపిఎ సాధించిన విద్యార్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో స్పాట్ రావాలని తెలిపారు.

ఇల్లందకుంటలో కృష్ణాష్టమి వేడుకలు

ఇల్లందకుంట, ఆగస్టు 28: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి గ్రామ దేవాలయంలో శ్రీకృష్ణాష్టమి సందర్భంగా ఉట్టి కార్యక్రమం వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య ఘనంగా నిర్వహించారు. అనంతరం స్వామివారం ఉత్సవమూర్తులను పల్లకిలో అధిరోహించి ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు, వంశీధారచార్యులు, జూనియర్ అసిస్టెంట్ మోహన్, మల్లారెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి ఎస్‌జిఎఫ్ క్రీడా పోటీలు

మానకొండూర్, ఆగస్టు 28 : మండవల స్థాయి ఎస్‌జిఎఫ్ పోటీలు సెప్టెంబరు 3నుంచి నిర్వహిస్తున్నట్లు మండల ఎస్‌జిఎఫ్ అధ్యక్షులు ఎం. మధుసుధనాచారి తెలిపారు. మండల స్థాయి క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్ 14, అండర్ 17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రీడలను సెప్టెంబరు 3,4 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సెప్టెంబరు 3న అండర్ 14, 17 బాలురకు కబడ్డీ,ఖోఖో, వాలీబాల్, 4న బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలను మానకొండూర్‌లోని బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

చిగురుమామిడి,అగస్టు 28: మండలంలోని ఇందుర్తి గ్రామానికి చెందిన చెల్పూరి నారయణ(65) అనే వ్యక్తి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా వారి కటుంబ సభ్యులకు బుదవారం గ్రామా విశ్వ బ్రహ్మణ సంఘం అధ్వర్యంలో 6 వేల నగదును అందజేశారు. ప్రభుత్వం నుచి వచ్చే అర్థిక సహాయాన్ని మంత్రి పొన్నం ప్రబాకర్ గౌడ్ దృష్టికి తీసుకెళికల వారిని ఆదుకుంటామన్నారు.